

**89**

**ధారావాహిక**

# జాయ సేనాపతి

చారిత్రక కాల్పనిక నవల

మత్తి భానుమూర్తి ...
99893 71284

**జరిగిన కథ :** ఒకనాడు ధనదుపురంలోని ప్రధాన వైష్ణవమఠంలోకి వెళ్లారు జాయపుడు, పరాశరుడు. శ్రీమన్నారాయణుని భజనతో ఉద్వేగంతో, భక్తిభావనలతో పులకించిపోతున్నది ఆ మందిరం. లోనికి ప్రవేశిస్తూనే పరాశరుడు పరవశుడై.. చేతులతో చప్పట్లు చరుస్తూ శ్రీమన్నారాయణుని భజిస్తూ ఆ భక్తుల్లో కలిసిపోయాడు. వైష్ణవ ఆహార్యంతో కాకుండా, సాధారణ పౌరునిలా ఉంటాడు పరాశరుడు.

అదే విషయాన్ని ప్రస్తావిస్తూ..

''నువ్వు వైష్ణవ పండిత ఆహార్యంలో లేవు. సాధారణ పౌరునిలా.. అంటే ఓ రైతు యువకునిలా ఉన్నావు కదా..'' అని అడిగాడు జాయపుడు.

''నిజానికి నేను పండిత వంశజుడిని కాదు. కుమ్మరి వృత్తికారుణ్ని. లిఖితసాహిత్యం కన్నా ప్రదర్శనీయ గేయ, రూపక, యక్షగానాల రచన నాకిష్టం. దేశీ కళాకారుల కోసమే రూపకాలు రచిస్తుంటాను. సంస్కృతంలోనూ రాయగలను కానీ, జానుతెలుగు, పామరభాష, యాస నాకు లోతు తెలిసినవి. వైష్ణవచిహ్నాలతో కాకుండా రైతులా ఉండటమే నాకిష్టం..'' నిజాయితీగా చెప్పాడు.

అదే ప్రశ్న తనను అడగకపోవడంతో జాయపుడు ఊపిరి పీల్చుకున్నాడు.

చిన్ననాటి నుంచి జాయపుడు తన సహజప్రవృత్తిగా నాట్యాలు, యుద్ధాలు చేశాడు. గురుకులంలో నాట్య లక్ష్య లక్షణాలు చదువుకున్నాడు. శివుడిపాత్ర వెనక శైవమతం అనేది ఉన్నదని, దానికో రోజువారీ జీవితవిధానం ఉంటుందని తెలియదు. తనకు చిన్ననాట నొసటన విబూదితో అడ్డంగా గీతలు పెట్టేది తల్లి. రాజవంశజులు అందరూ శైవమత పూజలు, క్రతువులు, అలంకరణాదులు పాటిస్తున్నారు కాబట్టి అదే తెలుసు. కానీ మరొక రకం వేషభూషణాదులు చూసినా అవి మరొక మతచిహ్నాలని గుర్తించలేదు. కారణం.. ముఖ్యంగా వయసు.

బౌద్ధారామాలలో, జైన బసదులలో ఉన్న విద్యాలయాలు, గ్రంథాలయాలు తెలుసు కానీ, బౌద్ధ, జైనమతాల చరిత్ర తెలియదు. అలాగే సమాజంలోని కళలు, సాహిత్యమూ, భాష, సంగీతం, చిత్రలేఖనం, గానం, గేయం, వాద్యం.. ఈ కళల రూపకల్పనల వెనుక దేవుడు ఉన్నాడని నమ్ముతాడు కానీ, ఆ దేవుళ్ల వెనుక మతాలు మతలబులు.. అవి సమాజాన్ని తీవ్రంగా ప్రభావితం చేస్తున్నాయని జాయపునికి ఇప్పుడు అవగతం అవుతున్నది. మతాలపట్ల తన అజ్ఞానాన్ని పరాశరుని వద్ద వినయంగా అంగీకరించాడు.

''నీకు బౌద్ధారామాలు, జైనబసదులు తెలుసుగా. అలాగే శైవానికో మఠం.. వైష్ణవానికో మఠం కూడా ఇక్కడ ఉన్నాయి. మా వైష్ణవమఠానికి వెళ్దాం పద..'' అన్నాడు పరాశరుడు.

కుతూహలంతో ధనదుపురంలోని ప్రధాన వైష్ణవమఠానికి వెళ్లాడు. అక్కడ ఉధృతంగా జరుగుతున్న భజన తంతు చూస్తూనే.. జాయపుని ముఖంలో తెలియకుండానే ఓ ఆహ్లాద ఛాయ పరచుకున్నది. ఎవరికీ అనుమానం రాకుండా చేతులు, పెదవులు కదుపుతూ అందరితో కలిసిపోయి కనిపించసాగాడు. భజన ఉధృతమైంది. పరిశీలన మరింత విశాలమైంది.

శ్రీమన్నారాయణుని కొలిచిన తర్వాత శ్రీకృష్ణుని, తర్వాత విష్ణువును, ఆ తర్వాత వేంకటేశ్వరుని భజించారు. ఆఖరిలో 'శ్రీమతే రామానుజాయ నమః' అంటూ రామానుజుడనే గురువును కీర్తిస్తూ భజన ముగించారు. అనంతరం అందరికీ దధ్యోజనం భోజనంగా వడ్డించారు మఠం నిర్వాహకులు.